# ఆగు, చూడు, నడు

## విహారి

వెంకటేశ్వర్లు చిరాకు మనిషి. అతనికి విసుగుదల ఎక్కువ. పనిగంటల్లో ఎక్కువభాగం అతని మొహం మునమునలాడుతూనే వుంటుంది. ఎప్పుడూ ఎవరో వొకర్ని పిలిచి కొరకొరచూస్తూ, నాలుగు చురకలేసి పంపిస్తూ వుంటాడు.

ఈ సంగతి మా అందరికీ తెలియనిది కాదు.

అందుకే రాజేశ్వర్రావ్ అంటూవుంటాడు, "ఆయన మొహం చూస్తే ఎప్పుడూ తుమ్మల్లో పొద్దుపొడిచినట్లే వుంటుంది" అని.

చంద్రమౌళి అయితే, మరో అడుగు ముందుకు వేసి, నిష్ఠూరంగా కోపగించుకుంటాడు కూడా. "మీరు ఆయనకి చికిత్స చేయించరు. ఆయన బాగుపడడం మీకూ ఇష్టంలేదు. ఆయన ఆరోగ్యంగా వుంటే, నిజానికి మీకు ఆఫీసులో ఆనందం కరువౌతుంది"—అని అతను నన్నొక్కణ్ణే దుయ్యపడుతూ వుంటాడు— వెంకటేశ్వర్లు బాధ్యత అంతా నా నెత్తినే వున్నట్టు.

ఇలా సాగుతున్న మామూలు కథకి— మా సీతాపతి, పెద్దమలుపొచ్చిందని చెప్పినప్పుడు— నేను విస్తుపోయాను.

"వెంకటేశ్వర్లు చాలా మారిపోయినట్లు కనిపిస్తున్నాడండి. నన్ను తన అంతరంగికుణ్ణిగా భావించి చాలా విషయాలు చర్చిస్తున్నాడు. తన వ్యక్తిగత విషయాలు ముచ్చటిస్తున్నాడు. మొన్నీ మధ్య శలవుమీద వెళ్ళాడు చూడండి: అప్పుడు నన్ను పిలిచి "హోల్డ్ ది ఫోర్ట్ అన్‌టిల్ ఐ కమ్ బాక్"అని చెప్పటమే కాక— ఆహ్లాదంగా చాలాసేపు పిచ్చాపాటీ మాట్లాడాడు. మనిషి వస్తుతహా సౌమ్యుడూ, మంచివాడే."

నేను సీతాపతికేసి ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాను.

—పదిరోజుల తర్వాత,

శనివారం,

ఒకగంట ఆలశ్యంగా ఆఫీసుకు చేరుకున్నాను. పర్మిషన్ స్లిప్ రాసి పంపించి నా సీట్లో కూర్చున్నాను.

వసుంధర చెప్పిన మాటల్ని నెమరువేసుకుంటూ సీతాపతి సీటుకేసి చూసేను.

అతను లేడు.

టేబుల్ తాళంతీస్తూ ప్యూన్ రంగయ్యని అడిగేను, "సీతాపతి రాలేదా?"

"వచ్చేరండీ. మేనేజర్ రూమ్‌లోకి వెళ్ళారు" చెప్పేడు.

నేను నా పనిలో పడ్డాను.

మనస్సు మాత్రం వసుంధర ఉదయం నుంచీ సతాయించిన విషయాన్ని గురించే ఆలోచించ సాగింది. భార్యగా— చివరిసారిగా— మంచి అధికారంతో కూడిన హెచ్చరికనే చేసి పంపింది, వసుంధర, తను చెప్పిన వ్యవహారం గురించి ఈ రోజు తప్పని సరిగా పూర్తి వివరాలు కనుక్కుని రావలసిందేనని గోముగా ప్రాధేయ పడింది·

చిరుకోపంతో అభ్యర్థించింది;

కర్కశంగా హుకుం జారీచేసింది·

నిష్కర్షగా ఆజ్ఞాపించింది,

—సిగరెట్ వెలిగించుకుంటూ తలెత్తి చూశాను.

సీతాపతి కేబిన్లో నుంచి బయటికి వచ్చాడు. చేతిలోని ఫైలుని టేబుల్‌మీద పెట్టి సీట్లో కూర్చున్నాడు.

నెమ్మదిగా లేచి అతని సీటుదాకా వెళ్ళాను. స్టూలు మీద కూర్చున్నాను.

నారాకను గమనించాడు సీతాపతి.

మొహం పక్కకి తిప్పుకుంటూ కలవరపడ్డాడు.

రుమాలు తీసి కళ్ళు తుడుచుకున్నాడు.

నేను గతుక్కుమన్నాను!

విషయం అర్థమైంది. ఏవో అక్షింతలు పడ్డాయన్నమాట.

మలుపొచ్చిందనుకున్న మామూలు కథలోని మార్పు నిలబడలేదనిపించింది.

నేను పరీక్షగా మళ్ళీ సీతాపతి కేసి చూశాను.

తల వంచుకుని ఫైల్లోని కాగితాల్ని తిరగేయసాగేడు.

పగిలిన గొంతుతో "చెప్పండి" అన్నాడు.

"వెంకటేశ్వర్లు ఏవంటాడు?" అడిగేను.

సీతాపతి మొహం పైకెత్తి నావైపు చూశాడు. అతని కనుకొలకుల్లో యింకా చెమ్మవుంది.

"ఆయన వేధింపు ఎక్కువైంది. భరించలేకుండా వున్నాను." నెమ్మదిగా అన్నాడు.

నేను కంగుతిన్నాను. నా ఊహ సరియైనదేనన్నమాట. వెంకటేశ్వర్లు కథకేమీ మలుపు రాలేదు. ఒకవేళ వచ్చివున్నా అది నిలకడ లేని మార్పు.

"అయితే వోసారి యూనియన్ వాళ్ళకి చెప్తేసరి. వాళ్ళే చూసుకుంటారు."

సీతాపతి అదోలా నవ్వేడు. "మంచి సలహానే మీది! మీరు నన్ను పెనం మీంచీ పొయ్యిలోకి తోసేట్టున్నారు." అన్నాడు.

నేను సాలోచనగా అతనికేసి చూసేను.

క్షణాలు నిశ్శబ్దంలో గడిచేయి.


"ఇంతకీ అసలు విషయమేమిటి" నేనే మళ్ళీ ప్రశ్నించేను.

కొద్దిసేపు తటపటాయించేడు సీతాపతి.

రుమాలుతో మొహమంతా తుడుచుకున్నాడు. "నాకంటే పెద్దవారు మీరు. నా శ్రేయోభిలాషులు. మీకు చెప్పుకుంటే కొంత బాధ తగ్గుతుంది"అని నా కళ్ళల్లోకి చూస్తూ, "సాయంత్రం మా యింటికి వెళ్దాం. అక్కడే

---

**వెంకటేశ్వర్లు రెణ్ణెల్ల క్రితం నన్ను పిలిచి తన చెల్లెల్ని పెళ్ళి చేసుకోమని అడిగేడు. ఆమె ఎమ్మే చేసి టీచర్‌గా పనిచేస్తోందనీ, ఒక కాలుకి అవిటితనం వుందనీ చెప్పేడు. అప్పట్నుంచీ వెంకటేశ్వర్లు అభిమానం చూపసాగేడు...!**




మాట్లాడుకోవచ్చు.'' అన్నాడు.

అలాగేనన్నట్టు తలవూపేను నేను.

** ** **

టౌనుకు దూరంగా ఎక్కడో చిలకలపూడిలో సీతాపతి ఇల్లు, నక్షత్రం ముగ్గు అంచులమీద గొబ్బెమ్మల్ని వుంచినట్లు అక్కడోటి ఇక్కడోటి ఇళ్ళు!

సీతాపతి ఇల్లు పాడుబడిన మండువా లోగిలి, వెలవెలబోతూ వుంది. ఊరి పొలిమేరలో ఒంటరి తాటిచెట్టులావుంది.

నన్ను లోపసారాలో కూర్చోబెట్టి, సైకిల్ని ఆ వసారాకి మరోమూలగా నిలబెట్టి లోపలికి వెళ్ళాడు; సీతాపతి.

బ్రిటీష్‌వాళ్ళ కాలంనాటి నాలుగు కాళ్ళ మేజాబల్ల ఒకటి నా ముందుంది. దానిమీద దినపత్రిక.

నేనా పత్రికని చాలా సార్లు చదివేశాను. తీరా చూస్తే అది ఆరురోజులనాటిది. సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ— చుట్టూ చూస్తూ— నిశ్శబ్దాన్ని భరిస్తున్నాను.

చేతిలో ప్లేటూ, మంచినీళ్ళ గ్లాసుతో బయట పడ్డాడు సీతాపతి. నా ముందుంచి ''తీసుకోండి, మాష్టారూ''అన్నాడు.

''మరినీకో''అడిగేను.

''నాది అయిందిలెండి. మీరు కానివ్వండి''

''ఏమిటీ— నన్నిక్కడ కూర్చోబెట్టి నువ్ లోపల లాగించేశావన్నమాట, చాలా అన్యాయం సీతాపతీ''అన్నాను.

ఇద్దరమూ నవ్వుకున్నాం. ''అదేం కాదులెండి. నేను పొద్దున భోజనంతోనే ముగించాను. మధ్యలో ఏమీ తినను. మీరు తీసుకోండి'' చెప్పాడు.

ప్లేటులో హల్వా, బందరులడ్డూ, బూందీవున్నై.

నేను తినసాగేను.

''మనిద్దరికీ పరిచయమై చాలా కాలమైనా మీరెప్పుడూ మా ఇంటికి రాలేదు''.

''నువ్వూ అంతేకదా. నిజానికి ఇవ్వాళ నేనే నిన్ను మా ఇంటికి ఆహ్వానిద్దామనుకున్నాను. కానీ, ఆ అవకాశాన్ని ముందుగా నువ్వు కొట్టేశావ్''

అన్నాను.

సీతాపతి కొద్దిసేపు మౌనం వహించాడు.

లౌకిక మర్యాదలు మరచి, మనసు విప్పి ఏదో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడు సీతాపతి. అతని వాలకం చూస్తే నాకట్టా అనిపించింది.

కానీ, మాటలు మారాం చేస్తున్నట్టున్నై. అదో విధమైన మానసిక ఘర్షణని అనుభవిస్తున్నాడు.

పెదవులు బిగించీ విడిచీ విచిత్రంగా తలని విదిలిస్తున్నాడు. కుడిచేతి ఐదువేళ్ళనీ ఒకవరుసలో ముడిచి, దానికి వ్యతిరేకమైన వరుసలో విడుస్తూకూర్చున్నాడు.

నిముషాలు గడుస్తున్నై.

నేను తినడం పూర్తి చేసి, నీళ్ళు తాగేను.

సీతాపతి మొదలెట్టేడు.

"మీకు తెలుసో తెలీదో నాకు భార్య పోయింది." అతని గొంతు బొంగురుపోయింది.

నాకు తెలిసిన సంగతే. అయినా, నొచ్చుకున్నాను. ఇక్కడ మొదలెట్టేడేమా అని ఆశ్చర్యపోయాను. నా జవాబుకోసం చూడకుండా చెప్పసాగేడు.

"వెంకటేశ్వర్లు రెణ్ణెల్ల క్రితం నన్ను పిలిచి తన చెల్లెల్ని పెళ్ళి చేసుకోమని అడిగేడు. ఆమె ఎమ్మే చేసి టీచర్‌గా పనిచేస్తోందనీ, ఒక కాలికి అవిటితనం వుందనీ చెప్పేడు. నేనేమీ మాట్లాడలేదు. అప్పట్నుంచీ వెంకటేశ్వర్లు నాపట్ల ప్రత్యేక శ్రద్ధని చూపసాగేడు. నేనంటే అభిమానంగా వుండడం మొదలెట్టాడు. ఆయన శలవు మీద వెళ్ళేరోజు మాట్లాడిన మాటలు కూడా మీకు చెప్పాను గదా".

విషయం సమస్తం అవగతమైంది నాకు.

ఆఫీసు విషయాల గురించి సిబ్బంది మీద విసుగూ, చిరాకూ ప్రదర్శించి చీటికీ మాటికీ చురకలేస్తాడనుకున్న వెంకటేశ్వర్లు— సీతాపతి పట్ల సౌమ్యం ప్రదర్శించడానికి అసలు కారణం ఇదన్నమాట, అప్పుడే నేను ఈ మామూలు కథకి మలుపొచ్చిందని అనుకున్నది!

నేను ఆలోచనలో పడిపోయాను.

సీతాపతి చెప్పడం కొనసాగించాడు. "ఈ మధ్య ఆయన మళ్ళీ ఆ ప్రస్తావన తెచ్చాడు. నేనాయన కోరికకి సుముఖంగాలేనని, నా నిరుత్సాహం ద్వారా గమనించాడు. అప్పట్నుంచీ అయినదానికీ కానిదానికీ నామీద విరుచుకుపడుతున్నాడు."

"ఇదేమైనా సబబుగా వుందా?" అని సూటిగా నన్ను ప్రశ్నించాడు, సీతాపతి. ఆ వెంటనే అన్నాడు, "ఇవ్వాళ పొద్దున్న ఆఫీసుకు రాగానే లోపలికి పిలిచి; ఏదో రిపోర్ట్ వంక పెట్టి సూటీపోటీ మాటలు మాట్లాడి, చివరికి ఎంతమాటన్నాడో తెలుసా మాస్టారు?"

సానునయంగా, సీతాపతి కేసి చూసేను, ఏమన్నాడో చెప్పమన్నట్లు.

"ఆఫీస్ వర్క్‌లో ఇనెఫిషెంట్ అని బుజువౌతూనే వుందిరోజూ, నా ప్రపోజల్‌కి ఏ సమాధానం చెప్పకపోవడం చూస్తే అసలు నీ గురించి నాకు మరో అనుమానం కలుగుతోంది" అంటూ ఏవేవో...

సీతాపతి చెప్పటం ఆపి తలవంచుకున్నాడు.

వెంకటేశ్వర్లు ఇంగ్లీషులో ఏం మాట అనివుంటాడో అర్థమైంది నాకు.

"ఆయన సంస్కారం అంతలో వుందన్నమాట. బాధపడకు. అసలు ఆ వెంటనే నాలుగూ దులిపేస్తే బాగుండేది" కోపంగా అన్నాను.

"అవును. నేనూ గట్టిగానే వాయించబోయాను. కానీ, తమాయించుకున్నాను."

"ఆగి పెద్దగా నిట్టూర్చేడు, సీతాపతి.

"ప్రస్తుతం నేను చాలా ఇబ్బందుల్లో వున్నానుమూర్తిగారూ. వెంకటేశ్వర్లుతో పేచీపడి, అతన్ని నాలుగుమాటలూఅని నెగ్గుకు రాగల స్థితిలో లేను. అందుకని, నా బాధను నేనే దిగమింగుకో వలసి వస్తోంది." గాద్గదికంగా చెప్తున్నాడు, సీతాపతి.

ఆఫీసులో సీతాపతి కళ్ళల్లో తిరిగిన నీటికి కారణం వుందన్నమాట!

"నన్ను పార్వతీపురంకి బదిలీ చేస్తానని బెదిరిస్తున్నాడు. మామూలుగా ఇలాంటి బెదిరింపు లకి బెంబేలుపడే మనిషిని కాకపోయినా, ఇప్పటి స్థితివేరు. రాధమరణంతోనే నా నడుం విరిగింది. మా లత ఎం.ఏ.పాసై ఇప్పుడు మునిసిపల్ హైస్కూల్లో టీచర్‌గా పని చేస్తోంది. నాకు ట్రాన్స్‌ఫర్ అయితే, పెద్ద సమస్య ఎదురౌతుంది."

"లత అంటే?" అడిగేను.

"మా అమ్మాయి."

నాకు ఉన్నట్టుండి ఉమ్మి మింగుడు పడలేదు.

"మీకు తెలీదు గదూ" అని అతనేదో




(తిట్టు)

"ఈ అబ్బాయి ఎవరు!" అడిగాడు భారత్ యింటికొచ్చిన శరత్.

"నాకొడుకు" అంటూ దగ్గరకు తీసుకున్నాడు ఆరేళ్ళ శీనుని భారత్.

"అమ్మా? చూడవే..కొత్తవాళ్ళముందు నాన్న నన్ను తిడుతున్నాడు" తక్కువ అన్నాడు శీను.

—బి.వి.యస్.బాబు.



చెప్పేంతలోనే, కాఫీ తీసుకుని వచ్చింది లత.

"ఇదిగో మాటల్లోనే వచ్చింది. ఈమే లత. మా పెద్దమ్మాయి".

కాఫీని స్టూల్ మీదవుంచి, నమస్కారం చేసింది లత. సన్నగా శలాకలా వుంది. మొహం పచ్చగా కళగా వుంది.

సీతాపతి మళ్ళీ మొదలెట్టేడు. "నాకు నలభై నాలుగు— ఇప్పుడు. లత వయస్సు ఇరవై రెండు. నాది ఎర్లీ మేరేజ్. లత తర్వాత అన్నపూర్ణ వుంది. బియ్యేస్సీ చదువు తోంది. నీకేమంత వయస్సు మీరి పోలేదు. మళ్ళీ పెళ్ళి చేసుకో మంటాడు.

వెంకటేశ్వర్లు. మీరు చెప్పండి. ఎదిగిన పిల్లలు ఇద్దర్నీ ఇంట్లో పెట్టుకుని, వాళ్ళ బాధ్యతల్ని విస్మరించి నేను మళ్ళీ తలంబ్రాలకి తలవంచడం భావ్యమేనా?"

ఎందుకో నాకు గుండె బిగపట్టి నట్లయింది. కొయ్యబారి పోయాను. లత ఉండ్రి మాటలు విన్నది.

స్తబ్దతలో నడిచి వెళ్తున్నట్టు నెమ్మదిగా కదిలి, లోపలికి వెళ్ళింది.

"నా ఇష్టాయిష్టాల ప్రమేయం లేకుండా నా మీద ఆశపెంచుకుని, ఆ తర్వాత ఇలా కక్ష కట్టడం, వెంకటేశ్వర్లులాంటి మనిషికి సబబేనా చెప్పండి."

సీతాపతికి నేనేం జవామివ్వగలను? వెన్నులో పోటు ప్రారంభమైంది నాకు. వసుంధర మాటలు

గుర్తుకొచ్చినై. "బంగారంలాంటి మనిషట మీ సీతాపతి. ఎలాగోలా మాట్లాడి మా చెల్లెలికి కుదర్చండి."

"వెంకటేశ్వర్లు గురించి నేనేం అభిప్రాయం చెప్పగలను? దొంగకు తేలుకుట్టే ఏడుపుకు ఆస్కారం ఏది?"

"ఇదంతా పోనీండిగానీ మూర్తిగారూ. వెంకటేశ్వర్లు నన్నిలా బాధించడానికి ఈ రోజే పూనుకోవడం నా గుండెల్ని మండిస్తోంది."అని

కనుబొమలు ఎత్తి వో క్షణం చూసి అన్నాడు "అన్నట్టు మీకు చెప్పలేదు కదూ— ఇవ్వాళ మా మేరేజ్ డే. ఆ... ఇటుచూడండి. నా రాధకూడా

ఇక్కడే వుంది." అంటూ జేబులో నుండి పర్సుతీసి, ఆమె ఫోటోని నా ముందుం చేడు.

"రాధతో పాతికేళ్ళ అమృతంలో తడిశాను. తెలిసితెలిసి ఇప్పుడు త్రోవలో అగ్గికణాల్ని పరచుకోలేనుగదా"

—సీతాపతి భావావేశంతో ఏమో చెప్తున్నాడుగానీ, నా మనస్సుకు పట్టడం లేదు.

లత కళ్లముందు మెదిలింది.

చూడక పోయినా, రాధ ఫోటో ఆధారంగా అన్నపూర్ణ రూపాన్నీ ఊహించుకుంది మనస్సు.

వసుంధర చెల్లెలికి సమాధానం— టీచర్‌గా ఉద్యోగం చేస్తున్న లత!

వెంకటేశ్వర్లు చెల్లెలికి చికిత్స— బియ్యేస్సీ

చదువుతున్న అన్నపూర్ణ!

ఊపిరి తెచ్చుకుని లేచి నిలబడ్డాను. గబగబా అడుగులు వేస్తూ బయటికి వచ్చేను.

అవును, అడుసు తొక్కకుండానే కాలుకడుక్కోవలసిన అవసరం— నానడక వేగాన్ని పెంచింది!!!!

*

